సాక్షి
నిజామాబాద్
ఆదివారం । 20 । ఏప్రిల్ । 2025



భూ వివాదాల..
భూభారతి చట్టం ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు.
- IIలో ▸



నేరాల నియంత్రణకు..
నేరాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అన్నారు.
- IIలో ▸

గరిష్టం/కనిష్టం
43.5 /22.0

వాతావరణం
ఉదయం నుంచి ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణంలో తేమశాతం తగ్గుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

తెల్లారితే కొడుకు పెళ్లి..

- రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి



నాగయ్య (ఫైల్)

రుద్రూర్: కొడుకు పెళ్లిని ఘనంగా నిర్వహించాలనుకున్న తండ్రి కానరాని లోకానికి వెళ్లిపోయాడు. భాజా భజంత్రీలు మోగాల్సిన ఇంట్లో రోదనలు మిన్నంటాయి. వివరాలు ఇలా ఉన్నాయి. రుద్రూర్ మండల కేంద్రానికి చెందిన తండ్రి గొర్ల నాగయ్య (52) కుమారుడి వివాహం ఆదివారం జరగాల్సి ఉంది. పోతంగల్ మండలం కారేగాం గ్రామంలో పెళ్లి పత్రికలు ఇచ్చేందుకు నాగయ్య శనివారం ఉదయం బైక్‌పై బయలుదేరాడు. హంగర్గా ఫారం సమీపంలో బైక్‌కు అడ్డంగా వచ్చిన కుక్కను తప్పించబోయి చెట్టుకు ఢీకొన్నాడు. తీవ్రగాయాలైన నాగయ్యను చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. నాగయ్య మరణ వార్త తెలుసుకున్న కుటుంబసభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. కాగా, నాగయ్య మిషన్ భగీరథలో హెల్పర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు.

'నేను చిందుల ఎల్లమ్మను' అనువాదం ఆవిష్కరణ

నిజామాబాద్ సిటీ: జిల్లాకు చెందిన చిందు కళాకారిణి జీవిత చరిత్ర ఆధారంగా రచించిన 'నేను చిందుల ఎల్లమ్మను' పుస్తక ఇంగ్లిషు అనువాదాన్ని హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శనివారం ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు చెందిన పరిశోధకుడు డాక్టర్ కొట్టూరు ముత్యం రచించిన చిందు ఎల్లమ్మ పుస్తకం పలువురి ప్రశంసలు పొందిందని అన్నారు. ఆయన కూతురు యామిని తండ్రి బాటలో నడుస్తూ ఆ పుస్తకాన్ని ఇంగ్లీషులోకి అనువదించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆచార్య సూర్యధనుంజయ, రాజేందర్, నాళేశ్వరం శంకర్, పులికొండ సుబ్బాచారి, తుర్లపాటి లక్ష్మి, శంకర్, వేల్పూరు భూమయ్య, అగ్నిపూలు ఎడిటర్ స్వయం ప్రకాశ్, చిందుల రాజేశ్వర్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో ఆదివారం నుంచి ఓపెన్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 15 కేంద్రాల్లో 2,710 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయి.

అమర్‌నాథ్ యాత్రికుల కోసం జీజీహెచ్‌లో ప్రత్యేక కౌంటర్లు



నిజామాబాద్ రూరల్: అమర్‌నాథ్ యాత్రికులకు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో ఫిట్‌నెస్ ధ్రువీకరణపత్రాలు ఇవ్వాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ నాయకులు శనివారం ఇన్‌చార్జి ఏడీ రాజశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో జీజీహెచ్‌లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ నాయకులు మాట్లాడుతూ.. అమర్‌నాథ్ యాత్రికులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ల జారీలో జాప్యం నెలకొంటోందని, ప్రత్యేక కౌంటర్ల ద్వారా భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని అన్నారు. విభాగ్ కార్యదర్శి తమ్మల కృష్ణ, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ ఠాగూర్, కార్యదర్శి గాజుల దయానంద్, కోశాధికారి నాంపల్లి శేఖర్, జిల్లా సహా కార్యదర్శి ధాత్రిక రమేశ్, నగర అధ్యక్షులు కోడిమల శ్రీనివాస్, విశ్వ హిందూ పరిషత్ కార్యకర్తలు పాల్గొన్నారు.

తాటికల్లు రకాలు

పోత్తాడు : మగ తాటి చెట్టు నుంచి ప్రతి ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు వస్తుంది.
పరుపుతాడు : ఆడ తాటి చెట్టుకు మొలిచిన మొగిలి చిగురుకు గీయడం ద్వారా పరుపుతాడు కల్లు వస్తుంది. ఫిబ్రవరి నుంచి మే నెల వరకు వస్తుంది.
పండుతాడు : తాటి చెట్టుకు కాసిన ముంజ ముదిరిన తరువాత ఆ కొయ్యకు గీయడం ద్వారా పండుతాడు కల్లు వస్తుంది. ఇది మే నుంచి ఆగస్టు వరకు వస్తుంది.
కర్రల కల్లు : తాటి చెట్టుకు ఉన్న కర్రలకు గీయడం ద్వారా వచ్చే కల్లును కర్రల కల్లు అంటారు. ఇది ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు వస్తుంది.
లావల కల్లు : తాటి చెట్లు లావలకు గీయడం ద్వారా వచ్చే కల్లును లావల కల్లు అంటారు. నవంబర్ నుంచి జనవరి వరకు వస్తుంది.



ఆర్మూర్ ప్రాంతంలో తాటిచెట్లు

సండే స్పెషల్

ఆ ఫీలే వేరు..

ప్రకృతి పానీయం.. గీత కార్మికులకు జీవనాధారం

- ఆరోగ్యానికి అండగా తాటి, ఈత కల్లు
- తాటి మండలు, ఈత వనాల్లో జోరుగా విక్రయాలు

తాటి మండ.. ఈత వనం.. ఎక్కడికి వెళ్లినా అదో అద్భుతమైన అనుభూతి. పోత్తాడు.. పరుపుతాడు.. మగ చెట్టు.. ఆడ చెట్టు.. ఈత కల్లు.. నీరా.. ఏదైనా ప్రకృతి ప్రసాదించిన స్వచ్ఛమైన కల్లు సేవించిన వారు వ్యక్తం చేసే సంతృప్తే వేరు. ఉత్తర తెలంగాణలో ముఖ్యంగా ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో లభించే కల్లుపై దేశంలోనే కాదు ప్రపంచంలోని వివిధ దేశాల్లో చర్చించుకోవడం స్వచ్ఛమైన కల్లు గొప్పతనాన్ని చెబుతోంది. రాష్ట్రరాజధాని హైదరాబాద్‌తోపాటు వివిధ ప్రాంతాల నుంచి ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ ఏరియాలకు కల్లు సేవించేందుకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. గౌడన్నకు ఉపాధి.. ప్రజలకు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తున్న ప్రకృతి పానీయం కల్లుపై 'సాక్షి' సండే స్పెషల్..



ఆర్మూర్: ఇంటికి చుట్టం వస్తే కల్లుగొబ్బ ప్రత్యక్షం కావాల్సిందే. 'మీ ఊళ్ల తాటి కల్లు మస్తుగుంటది..' అంటూ చుట్టం కళ్లు పెద్దవి చేస్తూ సంతృప్తి వ్యక్తం చేస్తే ఆ ఫీలే వేరు. అరేయ్ తాళ్లళ్లకు రారా.. నేను వనంలకు అచ్చిన, నువ్వేడున్నావ్.. ఇవి పల్లెల్లో వినిపించే మాటలు. ఇంటి, గ్రామ దేవతలకు నైవేద్యం వేసినా, శుక్రవారం పూజ చేసినా కల్లు లేనిదే పూర్తికాదు. గీత కార్మికుల ఆరాధ్య దైవమైన రేణుకా మాత ఎల్లమ్మ సన్నిధిలో వేల సంఖ్యలో గీత కార్మికులు కల్లు అమ్మకాలతో తమ జీవనాన్ని కొనసాగిస్తుండగా.. కల్లు ప్రియులు ఇష్టంగా సేవిస్తూ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

స్వచ్ఛమైన కల్లు గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు, కిడ్నీలో రాళ్లు, పచ్చకామెర్లతో బాధపడుతున్న వారికి ఎంతో మంచిది. బీపీ, గుండె పోటు వంటి వ్యాధుల నియంత్రణకు కల్లు ఎంతగానో ఉపయోగపడుతుందని వైద్యులు సైతం సూచిస్తున్నారు. అదే సమయంలో కల్లు ఏదైనా అతి మంచిది కాదంటున్నారు.

గీత కార్మికుడి పరికరాలు

తాటి, ఈత చెట్లు గీసే గౌడన్నలు ఉపయోగించే పరికరాలు దేనికి అదే ప్రత్యేకత కలిగి ఉంటుంది. తాటి చెట్లు ఎక్కేవారు నడుముకు నాలుగు కత్తులతోపాటు కల్లు గొబ్బలు వేలాడదీయడానికి వీలుగా ముస్తాదు, చెట్టు ఎక్కేందుకు మోకు, కాలికి గుయ్ అనే పరికరాలను ఉపయోగిస్తారు. బుంగలో పది లీటర్ల కల్లు, అద్దోడిలో 7 లీటర్ల కల్లు, బుర్ర, బింగిలను సైతం కల్లు నింపడానికి ఉపయోగిస్తారు. కల్లు సేవించేందుకు తాటి ఆకుతో చేసే దానిని రాకె అంటారు.

> "ప్యూర్ తాటి కల్లు తాగితే క్యాన్సర్ రానేరాదని పేపర్లలో చదువుతున్నాం. రోజంతా కష్టపడి పని చేసి వచ్చిన వాళ్లు గౌడ్ వద్ద రెండు గ్లాస్‌ల స్వచ్ఛమైన కల్లు తాగి అన్నం తిని పడుకుంటారు. తెలంగాణకు ఉన్న అలవాటది."
> – ముఖ్యమంత్రి హోదాలో అసెంబ్లీలో కేసీఆర్ వ్యాఖ్యలు

తాటి చెట్టు పెరిగి పెద్దది అయ్యేందుకు దానికి కల్లు గీసేందుకు 25 ఏళ్ల సమయం పడుతుంది. అప్పటి నుంచి వందేళ్లకుపైగానే ఆ చెట్టు నుంచి కల్లు తీస్తారు. తాటి చెట్ల లో ఆడ, మగ చెట్లు ఉంటాయి. మగ చెట్టు నుంచి పోత్తాడు కల్లు తీస్తే.. ఆడ తాటి చెట్టు నుంచి పరుపుతాడు, పండుతాడు, కర్రలు, లావల కల్లు తీస్తారు. కాలానుగుణంగా తాటి చెట్టు నుంచి వచ్చే కల్లును ఇష్టంగా సేవించే వారెందరో. ప్రతి చెట్టు నుంచి ఉదయం, సాయంత్రం 10 నుంచి 12 లీటర్ల కల్లు వస్తుంది. లీటర్ రూ.50 నుంచి రూ.100 వరకు విక్రయిస్తారు. ఆర్మూర్ ప్రాంతంలో మంథని, దేగాం, పెర్కిట్, రాంపూర్, ఆలూర్, వేల్పూర్, చేపూర్, కల్లెడి, జక్రాన్‌పల్లి మండలాల్లో తాటి కల్లు అందుబాటులో ఉంటుంది.

ఈత కల్లు



ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని దాదాపు అన్ని గ్రామాల్లో ఈత కల్లు లభిస్తుంది. ఆయా గ్రామాల్లో గీత కార్మికులకు ప్రభుత్వాలు కేటాయించిన స్థలాల్లో వేల సంఖ్యలో ఈత చెట్లను పెంచడం ద్వారా ఉపాధి పొందుతున్నారు. ఈత కల్లు ఉదయాన్నే సేవిస్తే ఆరోగ్యానికి ఎంతో మంచిది. ప్రతి ఏడాది చలికాలం సీజన్‌లో స్వచ్ఛమైన ఈత కల్లు లభిస్తుంది. పచ్చ కామెర్లు, కిడ్నీలో రాళ్లు, గర్భిణులు, బాలింతలు, పిల్లలకు సైతం ఈత కల్లు మంచిదని చెబుతుంటారు. ఈత కల్లు మాత్రం బొమ్మ మేడి, మోతుకాకులో తాగడానికి ఇష్టపడతారు.



బాల్కొండ మండలం ఎల్కటూర్ ఈతవనంలో కల్లు ప్రియులు

హైదరాబాద్ నుంచి రెంజర్లకు..

బాల్కొండ: ఈత కల్లు, నీరా సేవించి పార్సిల్ తీసుకు వెళ్లేందుకు హైదరాబాద్ నుంచి ముప్కాల్ మండలం రెంజర్లకు చాలా మంది ప్రతి ఆదివారం వస్తున్నారు. అక్కడి నుంచి తెల్లవారుజామున 4 గంటలకు బయల్దేరి వస్తున్న వారు రెంజర్ల నుంచి 12 గంటలకు తిరుగు ప్రయాణమవుతున్నారు. ఈత కల్లుతోపాటు, నీరాను బాటిళ్లలో నింపుకుని ఐస్ బాక్సుల్లో పెట్టుకుని వెళ్తున్నారు. వారం రోజుల వరకు నిత్యం సేవిస్తూ ఉంటామని తెలుపుతున్నారు. కొందరు రైళ్లలో ముంబై వంటి ప్రాంతాలకు ప్యూర్ కల్లును తీసుకెళ్తున్నారు.



హైదరాబాద్ నుంచి రెంజర్లకు వచ్చిన కల్లుప్రియుడు..



ఆర్మూర్ మండలం మంథనిలో..

మద్యం కన్నా మంచిది



"విస్కీ, బీర్‌కన్నా తాటి కల్లు, ఈత కల్లు ఆరోగ్యానికి చాలా మంచిది. అందుకే పట్టణ ప్రాంతాల వారు ప్రతి ఆదివారం ప్రత్యేకంగా మండకు వచ్చి కల్లు తాగుతారు." – దశరథ్‌గౌడ్, గీత కార్మికుడు, దేగాం

50 ఏళ్లుగా..



"50 ఏళ్ల నుంచి చెట్లు గీస్తున్నా. కల్తీ లేని కల్లు పోయడంతో మా గ్రామానికి కల్లు తాగేందుకు చాలా మంది వస్తుంటారు. పట్టణ ప్రాంతాల్లో మందుల కల్లు ఉంటుందని ఇక్కడికి వస్తారు." – రాజాగౌడ్, గీత కార్మికుడు, దేగాం

గీత కార్మికులకు జీవనోపాధి



"కల్లు అమ్మకాలతో వేల సంఖ్యలో గీత కార్మికులకు జీవనోపాధి లభిస్తోంది. కల్లు అమ్మకాలను ప్రోత్సహిస్తే మరింత నాణ్యమైన కల్తీ లేని కల్లును అందించేందుకు మేము సిద్ధంగా ఉంటాం." – దుర్గం సుదర్శన్, గీత కార్మికుడు, దేగాం

ఆరోగ్యానికి మేలు



"ఈత కల్లు, తాటి కల్లుపై పూర్వీకులతోపాటు సైంటిస్టులు సైతం చాలా పరీక్షలు నిర్వహించారు. కిడ్నీ సంబంధిత సమస్యలు, పచ్చ కామెర్లు వంటివి కల్లుతో తగ్గడం మనం చూస్తూనే ఉన్నాం. గర్భిణులు, బాలింతలు సైతం స్వచ్ఛమైన కల్లు తాగడం వల్ల ఆరోగ్యం కుదుట పడుతుందన్నది మన పెద్దలు చెబుతున్న నిజం. వ్యసనంగా మార్చుకోకుండా కల్లు సేవించడం మంచిదే." – డాక్టర్ రమేశ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఆర్మూర్

లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ ప్రక్రియ

- కలెక్టర్ హనుమంతు వెల్లడి
- కొనుగోళ్లపై వీసీ ద్వారా సమీక్షించిన మంత్రులు ఉత్తమ్, సీతక్క



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ ప్రక్రియ కొనసాగుతోందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్లు, తాగునీటి సరఫరాపై పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో కలిసి సంబంధిత శాఖల మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల వివరాలను కలెక్టర్ హనుమంతు వివరించారు. యాసంగిలో జిల్లాలో 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకుని, ఇప్పటికే 3.14 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ఇందులో ఎక్కువ మొత్తం సన్న ధాన్యం ఉండగా, దొడ్డు రకం ధాన్యం కేవలం 12 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చిందని వివరించారు. మే చివరి వారం నాటికి లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోలు చేసేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. డిఫాల్ట్ లేని రైస్ మిల్లులకు ధాన్యం నిల్వలను కేటాయిస్తూ, మిల్లుల వద్ద దిగుమతిలో జాప్యానికి తావులేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రైతు మహోత్సవం

- వివిధ అంశాలపై రైతులకు అవగాహన కల్పించనున్న శాస్త్రవేత్తలు
- సుమారు 150 స్టాళ్ల ఏర్పాటు
- గిరిరాజ్ కళాశాల మైదానంలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్
- సమన్వయంతో పని చేయాలని అధికారులకు ఆదేశం



ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు మూడు రోజులపాటు జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల మైదానంలో రైతు మహోత్సవం నిర్వహించనున్నారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు శనివారం అందుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా నిర్వహించనున్న రైతుమహోత్సవాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభిస్తారని కలెక్టర్ తెలిపారు. మహోత్సవంలో వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు పాల్గొని వారు పండించిన ఉత్పత్తులను ప్రదర్శిస్తారని, సహజ పద్ధతుల్లో పంటల సాగు, యాంత్రీకరణ, అధునాతన వంగడాలు, పసుపు ఆధారిత ఉత్పత్తులతోపాటు, పరిశ్రమల స్థాపనకు ఉన్న అవకాశాలు తదితర అంశాలకు సంబంధించి సుమారు 150 వరకు స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. వ్యవసాయం, అనుబంధ విభాగాలు, విశ్వవిద్యాలయాలు, బ్యాంకులు, స్టార్టప్ కంపెనీలు, ఎఫ్‌పీవోలు, ఇతర ప్రైవేట్ కంపెనీలకు సంబంధించిన స్టాల్స్ ఉంటాయని పేర్కొన్నారు.

వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు సాగు రంగంలో అవలంబించాల్సిన ఆధునిక విధానాలు, అధిక దిగుబడుల సాధనకు పాటించాల్సిన పద్ధతులు, పెట్టుబడులను తగ్గించుకోవడం, అధిక లాభాలను అందించే పంటల ఎంపిక తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారని అన్నారు. ప్రగతిశీల అవార్డు గ్రహీత రైతులు తమ అనుభవాలను తోటి రైతులతో పంచుకుంటారని తెలిపారు. ఎంతో ప్రాధాన్యతతో కూడిన రైతు మహోత్సవ కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రైతు మహోత్సవానికి పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట వ్యవసాయ కమిషనరేట్ నుంచి హాజరైన ఏడీఏలు హుస్సేన్‌బాబు, వినోద్‌కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

ఉమ్మడి జిల్లా రైతులు తరలిరావాలి



మాట్లాడుతున్న ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి

సుభాష్‌నగర్: జిల్లా కేంద్రంలో సోమవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్న రైతు మహోత్సవానికి ఉమ్మడి జిల్లా రైతులు తరలిరావాలని ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి కోరారు. నగరంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయంలో నూతన పద్ధతులు, శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం ద్వారా లాభసాటి వ్యవసాయం, రైతుకు అధిక దిగుబడి వచ్చే అంశాలు, డ్రోన్ వ్యవసాయం, వివిధ రకాల వంగడాలకు సంబంధించిన స్టాళ్లు ఉత్సవాల్లో ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. సమావేశంలో బ్యాంకు వైస్ చైర్మన్ నల్ల చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు గిర్దావర్ గంగారెడ్డి, గోర్కంటి లింగన్న, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ క్రెడిట్ మోసం.. ముఠా సభ్యుల అరెస్ట్

- నిరుద్యోగులను మోసగించిన నిందితులు
- సీపీ పోతరాజు సాయిచైతన్య వెల్లడి

ఖలీల్‌వాడి: దుబాయ్‌లో ఉద్యోగంతోపాటు అధిక డబ్బులు ఇస్తామని ఆశచూపి నిరుద్యోగులను మోసం చేసిన ముఠాను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీస్ కమిషనర్ సాయిచైతన్య శనివారం వెల్లడించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 5న నందిపేట్ పోలీస్‌స్టేషన్‌లో అన్నారం గ్రామానికి చెందిన పొగరు రవికిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. కేసులో ప్రధాన నిందితులుగా దోందిగల భూమేశ్ అలియాస్ పబ్బ భూమేశ్‌రెడ్డి, అతని భార్య పబ్బ స్వప్నతోపాటు నందిపేట్‌కు చెందిన అరుగుల భోజరాం, మోచరాజు, బిజ్జం సుబ్బారెడ్డి (శ్రీదేవి ట్రావెల్స్ యజమాని, నిజామాబాద్), ఆరేపల్లి మహేశ్ (ట్రావెల్ ఏజెన్సీ, ఆర్మూర్)పై చీటింగ్ కేసుతోపాటు ఇమిగ్రేషన్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. నిందితులందరూ ఒక గ్రూపుగా ఏర్పడి నిరుద్యోగ యువతకు దుబాయ్‌లో మంచి కంపెనీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి ఆశచూపారు. మూడు కంపెనీలలో వారే జనరల్ మేనేజర్, ఫైనాన్స్ మేనేజర్లమంటూ చెప్పుకొని యువకులకు వీసాలు పంపించి ఒక్కొక్కరి వద్ద రూ. 6 లక్షలు వసూలు చేశారు. దుబాయిలో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగమని, హై ప్రొఫైల్ క్రియేట్ చేసి క్రెడిట్ కార్డ్స్, పర్సనల్ లోన్స్ తీసుకొని ఆరు నెలల తర్వాత రూ.30 లక్షల ఇచ్చి తిరిగి స్వదేశానికి పంపిస్తామని మాయమాటలు చెప్పారు. నమ్మిన కొందరు డబ్బులు చెల్లించి దుబాయ్ వెళ్లారు. తీరా అక్కడికి వెళ్లిన తర్వాత ఉద్యోగం చూపించకుండా 6 నెలల తర్వాత బెదిరించి తిరిగి ఇండియాకు పంపించినట్లు సీపీ తెలిపారు. ఈ ముఠా సభ్యులు సుమారు 70 నుంచి 80 మంది నిరుద్యోగులను మోసం చేసినట్లు వెల్లడించారు. సీసీఎస్ ఏసీపీ నాగేంద్ర చారి ఆధ్వర్యంలో నందిపేట ఎస్సై ఎం చిరంజీవి ఈ నెల 12న అరుగుల భోజారాంను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా, శనివారం మరో ఇద్దరు నిందితులైన పబ్బ స్వప్న, బిజం సుబ్బారెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. పబ్బ స్వప్నపైన గతంలో జక్రాన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో గల్ఫ్ చీటింగ్ కేసులు ఉన్నాయన్నారు. దోందిగల భూమేశ్, మోచరాజు, ఆరేపల్లి మహేశ్‌లు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. యువత నకిలీ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని, బాధితులు ఎవరైనా ఉంటే న్యాయ సహాయం కోసం పోలీసులను సంప్రదించాలని సీపీ సాయి చైతన్య సూచించారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు తొర్లికొండ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన శశికుమార్, గంగోత్రి జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 16 నుంచి 18 వరకు నిర్మల్‌లో జరిగిన 68వ రాష్ట్ర స్కూల్ గేమ్స్ అండర్–17 బేస్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ నెల 22 నుంచి 26 వరకు న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో శశికుమార్, గంగోత్రి పాల్గొంటారని ఫిజికల్ డైరెక్టర్ మర్కంటి గంగామోహన్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను ప్రధానోపాధ్యాయుడు, ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాస్ అభినందించారు.

రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ, ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులకు సంబంధించి ఏప్రిల్‌లో విడుదలైన 1, 3, 5వ సెమిస్టర్స్, ఎల్‌ఎల్‌బీ 1, 5వ సెమిస్టర్ పరీక్షా ఫలితాల రీవాల్యుయేషన్ కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కంట్రోలర్ ప్రొఫెసర్ కే సంపత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రీవాల్యుయేషన్ కోసం ఒక్కో పేపర్‌కు రూ.500 లు, దరఖాస్తు ఫారానికి రూ.25 లు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 26 వరకు రీవాల్యుయేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్www. telangana university. ac. in ను సందర్శించాలని సూచించారు.

పాఠశాలల అభివృద్ధికి చేయూతనివ్వాలి


రైడ్స్ లోగో ఆవిష్కరిస్తున్న జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్

రుద్రూర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులు ఆయా పాఠశాలల అభివృద్ధికి చేయూత అందించాలని జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ సూచించారు. రుద్రూర్ హైస్కూల్‌లో 1965 నుంచి 2015 వరకు చదివిన విద్యార్థులతో రైడ్స్ (రుద్రూర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషనల్ సొసైటీ)ని ఏర్పాటు చేయగా.. అందుకు సంబంధించిన లోగోను జేటీసీ శనివారం ఆవిష్కరించారు. అనంతరం రైడ్స్ నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. రైడ్స్ శాశ్వత గౌరవ అధ్యక్షుడిగా తనను ఎన్నుకోవడంపై సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జేటీసీ చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ రైడ్స్ కార్యక్రమాలకు మామిండ్ల రామాగౌడ్ స్మారక ట్రస్ట్ అండగా ఉంటుందని అన్నారు. విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయడంతోపాటు పేద విద్యార్థుల ఉన్నత చదువులకు రైడ్స్ ద్వారా తోడ్పాటు అందిస్తామన్నారు.

భూ వివాదాల పరిష్కారానికి ‘భూ భారతి’

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు


వర్నిలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

రుద్రూర్/ వర్ని : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం ద్వారా భూ వివాదాలకు శాశ్వతంగా పరిష్కారం లభిస్తుందని, రైతుల భూములకు పూర్తి భరోసా లభిస్తుందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పేర్కొన్నారు. రుద్రూర్, వర్ని మండలాల్లో భూ భారతి చట్టంపై శనివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడారు. భూములకు సంబంధించిన వివాదాలను తొలగించి, పూర్తి హక్కులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ధరణి పోర్టల్‌లో లేని పలు సమస్యలకు భూభారతి ద్వారా పరిష్కారం లభిస్తుందన్నారు. ధరణిలో ఏదైనా అభ్యంతరం ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి వచ్చేదని, భూ భారతి చట్టం ప్రకారం తహసీల్దార్ స్థాయిలో న్యాయం జరగకపోతే ఆర్డీవోకు, అక్కడా సంతృప్తి చెందకపోతే కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చునని తెలిపారు. వివిధ గ్రామాల రైతులు భూ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా త్వరలోనే గ్రామాల వారీగా సదస్సులు ఏర్పాటు చేసి అర్జీలు స్వీకరించి పరిష్కారిస్తామన్నారు. భూ భారతి చట్టంలోని సెక్షన్‌లు, వాటి వివరాలు, ప్రయోజనాలను అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు వివరించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. సదస్సులో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఏసీపీ శ్రీనివాస్, తహసీల్దార్లు తారాబాయి, సాయిలు, ఎంపీడీవోలు వెంకటేశ్, భీమ్‌రావ్, మాజీ జడ్పీటీసీ నరోజి గంగారాం, విండో మాజీ చైర్మన్ పత్తి రాము, విండో వైస్ చైర్మన్ తోట అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఇందూరు విద్యార్థుల సత్తా

- 9 మంది కాకతీయ విద్యార్థులకు ఆలిండియా ర్యాంకులు
- ఎస్‌ఆర్ కళాశాల విద్యార్థికి ఎస్టీ విభాగంలో 98వ ర్యాంకు


విద్యార్థులను అభినందిస్తున్న కాకతీయ కళాశాల డైరెక్టర్ రామోజీరావు


సంకీర్త్ (కాకతీయ)


భానుప్రతాప్ (కాకతీయ)


బీ ప్రవీణ్ (కాకతీయ)

నిజామాబాద్‌అర్బన్: జేఈఈ మెయిన్స్– 2025 ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. జిల్లా కేంద్రంలోని కాకతీయ జూనియర్ కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో సత్తాచాటారు. ఆలిండియా లెవల్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. కళాశాలకు చెందిన మేఘన (824), సంకీర్త్ (1,750), భానుప్రతాప్ (3,820), ప్రవీణ్ (7,456), అరవింద్ (11,246), వేదస్కర్ (12,385), నికేతన్(21,519), హాసిని (30,243), అమృత్ వర్ష్ (39,052), ఎండీ ముద్దస్సర్ (43,733), ఎస్ తనూజ (44,161), ఎం భవ్య శ్రీ (48,472) ర్యాంకు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్‌పర్సన్ సీహెచ్ విజయలక్ష్మి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇంటర్‌తో పాటు జాతీయస్థాయి పోటీ పరీక్షలైన ఐఐటీ, మెడికల్, ఎంసెట్‌లలో రాణించడమే లక్ష్యంగా విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్‌తోపాటు తొలి ప్రయత్నంలోనే డైరెక్ట్‌గా ఐఐటీ, జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో విద్యార్థులు జాతీయస్థాయి ర్యాంకులు సాధించారన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సీహెచ్ రామోజీరావు, ప్రిన్సిపాల్ రణదీష్, వైస్ ప్రిన్సిపాల్ సందీప్ కులకర్ణి తదితరులున్నారు.

సంతోషంగా ఉంది



ఇంటర్‌తోపాటు తొలి ప్రయత్నంలోనే జేఈఈ మెయిన్స్‌లో ఆలిండియా 824 ర్యాంకు సాధించడం సంతోషంగా ఉంది. అద్భుతమైన ర్యాంకు సాధించడానికి కళాశాల యాజమాన్యం ఎంతగానో తోడ్పాటు అందించింది. కాకతీయ ఉపాధ్యాయ బృందం ఎప్పటికప్పుడు సందేహాలను నివృత్తి చేస్తూ మంచి విద్యాబోధన అందించింది.

– మేఘన, 824 ర్యాంకు, కాకతీయ కళాశాల

ఎస్‌ఆర్ కళాశాలకు ర్యాంకులు..


బాదావత్ సురేశ్

నగరంలోని ఎస్‌ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్ ఫలితాలలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. బాదావత్ సురేశ్ ఎస్టీ విభాగంలో ఆలిండియా 98వ ర్యాంకుతోపాటు జిల్లా మొదటి ర్యాంకు సాధించినట్లు కళాశాల డీజీఎం గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. కళాశాలకు చెందిన ఆకాశ్ (1813), బీ సాయి పవన్ (3248), సచిన్ (3333), అఖిల (3828), ఇపుల్ (4329), శివసాయి (4721), భరత్ (6839), వాసు (6876), అక్షద్ (8071), సాయిచరణ్ (9873) ర్యాంకులు సాధించారన్నారు. 10 వేలలోపు 12 మంది, 20 వేలలోపు 26 మంది ఆలిండియా ర్యాంకులు సాధించారు. 96 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల జోనల్ ఇన్‌చార్జి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

‘నారాయణ’ విద్యార్థుల ప్రతిభ


రియా

నగరంలోని నారాయణ జూనియర్ కళాశాలకు చెందిన పంచమహాల్కర్ రియా ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 2627 ర్యాంకు సాధించినట్లు ఏజీఎం కుంట లక్ష్మారెడ్డి తెలిపారు. కళాశాలకు చెందిన వేములపల్లి హర్షిత్ (3205), పీ అఖిల్ (4922), వీ గగన శ్రీ (9389), ఎం అజయ్ (9601), కే భాస్కర్ (14,738), పుట్ట రఘునాథ్ (17,899) ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. 10వేల లోపు ఐదుగురు విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. జేఈఈ మెయిన్స్ ఫలితాలలో రియా 99.62 శాతం పర్సంటైల్ సాధించిందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రవి గౌడ్, శేఖర్, శ్రీనివాసరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వెక్టర్ కళాశాల విద్యార్థులకు..


నిషాంత్ రెడ్డి

నగరంలోని వెక్టర్ జూనియర్ కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్ ఫలితాలలో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు కళాశాల చైర్మన్ మధుసూదన్ జోషి తెలిపారు. మామిడి నిషాంత్ రెడ్డి (1450), వినాయక్ జోషి (7054), చంద్రవదన్ రెడ్డి (7696) ఆలిండియా ర్యాంకులు సాధించారన్నారు. కళాశాలకు చెందిన 25 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ఎంపికైనట్లు తెలిపారు.

అక్రమార్కులకు శిక్ష పడాలి


సమీక్ష సమావేశానికి హాజరైన పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ లక్ష్మీనర్సయ్య

- డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ లక్ష్మీనర్సయ్య

ఖలీల్‌వాడి: అక్రమ వ్యాపారాలు నిర్వహించే వారికి శిక్ష పడేలా చూడాలని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ పీ లక్ష్మీనర్సయ్య పేర్కొన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని కోర్టుల్లో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో మాదక ద్రవ్యాల కేసులపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లమందు, హెరాయిన్, చరస్, గంజాయి, మారిజువానా, కొకైన్ మొదలైన మాదకద్రవ్యాల కేసులో ముద్దాయిలకు శిక్ష పడేలా చూడాలన్నారు. మాదక ద్రవ్యాల నిరోధకంతో విద్యార్థులు, యువకులకు తోడ్పాటును అందించనట్లవుతుందని తెలిపారు. అనంతరం నూతనంగా నియామకమైన కామారెడ్డి అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీ సూర్యప్రసాద్‌ను సత్కరించారు. సమావేశంలో జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పీసు రాజేశ్వర్ రెడ్డి, రాజగోపాల్ గౌడ్, రాజారెడ్డి, డీ సూర్యప్రసాద్, బంటు వసంత్, దామోదర్ రెడ్డి, కావేటి శేషు, శ్రీనివాస్ ఖాందేశ్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు జీ రామకృష్ణ, భూసారపు రాజేశ్ గౌడ్, అశోక్ శివరాంనాయక్, చిదిరాల రాణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జడ్జికి సన్మానం

బదిలీపై వెళుతున్న జిల్లా జడ్జి సునీతా కుంచాలను ప్రాసిక్యూషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సయ్య మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా జిల్లా జడ్జిగా ఎంతో సామరస్యంగా ఎన్నో కేసులలో జీవితా కారాగార శిక్ష విధించారన్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు

- సీపీ సాయి చైతన్య


వర్ని స్టేషన్‌లో రికార్డుల గదిని పరిశీలిస్తున్న సీపీ

వర్ని/రుద్రూర్: నేరాల నియంత్రణకు కఠినచర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆఫ్ పోలీస్ సాయి చైతన్య పేర్కొన్నారు. వర్ని, రుద్రూర్, కోటగిరి పోలీస్ స్టేషన్లను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిసెప్షన్ సెంటర్, కంప్యూటర్ సిబ్బంది పని తీరును అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో సౌకర్యాలు, సమస్యలపై ఆరా తీశారు. మత్తు పదార్థాలు, గంజాయి, గేమింగ్ యాప్స్, సైబర్ నేరాల బారి నపడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సీపీ వెంట బోధన్ ఏసీపీ శ్రీనివాస్, ఎస్సైలు సాయన్న, మహేశ్ ఉన్నారు.

బ్లాక్ మెయిల్ చేస్తున్న వ్యక్తి అరెస్ట్

మాచారెడ్డి: మేన మామను బ్లాక్ మెయిల్ చేస్తూ రూ. 40 లక్షలు డిమాండ్ చేసిన మేనల్లుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. పాల్వంచ మండలం ఫరీదుపేట గ్రామానికి చెందిన జీడిపల్లి నరసింహారెడ్డి ప్రభుత్వ భూమిని ఆక్రమించి ప్లాట్లు చేసి షట్టర్లను నిర్మించాడని తన మేనల్లుడు ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన గురిజాల మధుసూదన్‌రెడ్డి సోషల్ మీడియాతోపాటు పత్రికల్లో దుష్ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ఎందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నావని మధుసూదన్‌రెడ్డిని అడిగిన నరసింహారెడ్డిని చంపుతానని బెదిరించి, తప్పుడు ప్రచారం చేయకుండా ఉండాలంటే రూ.40 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు బాధితుడు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు మధుసూదన్‌రెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

వర్ని: మండలంలోని పాత వర్ని గ్రామంలో బొగ్గుల వీరయ్యకు చెందిన నివాసపు ఇల్లు శనివారం మధ్యాహ్నం దగ్ధమైంది. ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీకై దేవుని మండపం వద్ద వెలిగించిన దీపం అంటుకొని మంటలు ఎగిసిపడినట్లు బాధితులు వెల్లడించారు. ఇల్లు పూర్తిగా దగ్ధమై బియ్యం, వంట సామగ్రి,బట్టలు, నిత్యవసర వస్తువులు పూర్తిగా బూడిదైనట్లు వెల్లడించారు. ప్రమాదంలో సుమారు రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

రాజ్యాంగ వ్యతిరేక వీడీసీలను నిషేధించాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల ప్రతినిధుల డిమాండ్


రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

నిజామాబాద్‌నాగారం: రాజ్యాంగ వ్యతిరేక వీడీసీలను నిషేధించాలని ప్రజా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. కల్లుగీత కార్మిక సంఘం పక్షాన ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తాళ్లరాంపూర్‌లో గౌడ, గీతా కుటుంబాలను వీడీసీలు సాంఘిక బహిష్కరణ, మహిళలను గుడిలోకి రానివ్వకుండా అవమానపరుస్తున్నారని పేర్కొన్నారు. ఈతవనాన్ని తగలబెట్టడం లాంటి ఆటవిక, అనాగరిక చర్యలకు పూనుకున్న వీడీసీలను నిషేధించి, బాధ్యులను అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో వీడీసీల ఆగడాలు, అరాచకాలు మితిమీరి పోతున్నాయన్నారు. తాళ్లరాంపూర్ ఘటనపై అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు స్పందించకపోవడం సిగ్గుచేటని, ఓటు బ్యాంకు రాజకీయాలు నడుస్తున్నాయని ఆరోపించారు. ఈత వనం నష్టపరిహారం చెల్లించాలని, లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. 25న చలో తాళ్లరాంపూర్ పేరిట ఆర్మూర్ ఆర్డీవో ఆఫీసు ఎదుట మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. పెద్ది వెంకటరాం, రమేశ్ బాబు, నూర్‌జహాన్, ప్రభాకర్, సుధాకర్, విఠల్ గౌడ్, నర్రా రామారావు, బాస రాజేశ్వర్, విఠల్ రావు, బుస్సా శంకర్, అల్గొట్ రవీందర్, ధర్మేందర్, చంద్రశేఖర్, సాయికుమార్, మాయావర్ రాజేశ్వర్, పద్మ, శ్యామ్, నీరడి లక్ష్మణ్, కోయేడి నర్సింలు గౌడ్, శ్రీరామ్ గౌడ్, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సహకారం మరువలేనిది



జడ్జి పద్మావతిని సన్మానిస్తున్న బార్ సభ్యులు

ఖలీల్‌వాడి : జిల్లా న్యాయసేవాధికార సంస్థ నిర్వహించిన ప్రతి కార్యక్రమంలో న్యాయవాదుల సహకారం మరువలేనిదని డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి అన్నారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని సమావేశపు హాల్‌లో బార్ అధ్యక్షుడు మామిల్ల సాయారెడ్డి అధ్యక్షత ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉద్యోగరీత్యా బదిలీపై వచ్చానని, బదిలీపై వెళ్లడం సహజమని, పదవికి న్యాయం చేశామా లేదా అనేదే ముఖ్యమని తెలిపారు. న్యాయసేవాధికార సంస్థ తరఫున కక్షిదారులకు న్యాయ సేవలు అందించడంలో అగ్రస్థానంలో ఉన్నామని పేర్కొన్నారు. బార్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సాయారెడ్డి, మాణిక్ రాజు మాట్లాడుతూ లోక్ అదాలత్‌లను విజయవంతం చేయడంలో న్యాయవాదులు క్రియాశీలక పాత్ర పోషించారని తెలిపారు. అనంతరం జడ్జి పద్మావతిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బార్ ఉపాధ్యక్షుడు దిలీప్, సంయుక్త కార్యదర్శి ఝాన్సీరాణి, కోశాధికారి నారాయణ దాసు, లైబ్రరీ కార్యదర్శి శ్రీమాన్, న్యాయవాదులు పాల్గొన్నారు.

మహిళా దొంగ అరెస్టు

మాక్లూర్: మండలంలోని బొంకన్‌పల్లి గ్రామంలో దొంగతనానికి పాల్పడిన మహిళా దొంగను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నార్త్‌జోన్ సీఐ బీ శ్రీనివాస్, మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ శనివారం వివరాలు వెల్లడించారు. ఈ నెల 17న రాత్రి బొంకన్‌పల్లి గ్రామానికి చెందిన బింగి సురేశ్ ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చొరబడి 7 గ్రాముల బంగారం, రూ. 8 వేల నగదు అపహరించుకపోయారు. బాధితుడు తన ఇంటి పక్కన నివాసం ఉండే జ్యోతిపై అనుమానం వ్యక్తం చేస్తూ 18న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై రాజశేఖర్ అత్యంత చాకచక్యంగా వ్యవహరించి మహిళా పోలీసులతో జ్యోతిని అదుపులోకి తీసుకొని విచారణ చేయగా.. సురేశ్ ఇంటితోపాటు నెల క్రితం అదే గ్రామానికి చెందిన కటికె శారద ఇంట్లో కూడా చోరీకి పాల్పడినట్లు నిందితురాలు ఒప్పుకున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. చోరీ చేసిన రూ.2 లక్షల 48వేల విలువైన ఆభరణాలను రికవరీ చేశామన్నారు. ఈ సందర్భంగా ఎస్సై రాజశేఖర్‌తోపాటు పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు.

రాజంపేటలో మరొకరు..

రాజంపేట: చోరీలకు పాల్పడిన వ్యక్తిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 16న పొందూర్తి గ్రామంలోని కల్లు దుకాణంలో రాత్రి చొరబడి చోరీకి పాల్పడిన చమన్ నరేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

క్రైం కార్నర్

స్విమ్మింగ్‌పూల్‌లో యువకుడి మృతి

మృతుడు మెదక్ జిల్లా చేగుంటవాసి


తిరుపతి సంజయ్ (ఫైల్)

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో ఉన్న స్విమ్మింగ్‌పూల్‌లో మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రానికి చెందిన యువకుడు శనివారం మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చేగుంట మండల కేంద్రానికి చెందిన తిరుపతి సంజయ్ అలియాస్ లాల్ (21) కూలి పనులు చేస్తూ జీవిస్తున్నాడు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం దామరచెర్వులోని బంధువుల ఇంటికి వచ్చాడు. వారితో కలిసి పెద్దమల్లారెడ్డిలో ఉన్న ప్రైవేట్ స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొట్టేందుకు వచ్చాడు. ఈత కొడుతుండగా తలకు గాయమై ఫిట్స్ రావడంతో నీటిలో మునిగిపోయాడు. గమనించిన బంధువులు వెంటనే సంజయ్‌ను ఒడ్డుకు తీసుకొచ్చి 108లో రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, సంజయ్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి ఇంకా పెళ్లి కాలేదు. తల్లి మంజుల ఉంది. మృతదేహాన్ని చేగుంటకు తరలించారు.

ఆటో బోల్తా.. విద్యార్థులకు గాయాలు


ప్రమాదానికి గురైన ఆటో

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ఆటో బోల్తా పడి విద్యార్థులకు గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. పెర్కిట్‌లోని ఓ పాఠశాలకు చెందిన విద్యార్థులు తరగతులు ముగించుకొని రోజూ మాదిరిగానే ఆటోలో మొత్తం 9 మంది ఇంటికి బయల్దేరారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోకి రాగానే ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో సాత్విక్, శ్రీవల్లి అనే విద్యార్థులకు గాయాలు కాగా స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకొని ఘటనా స్థలానికి చేరుకున్న తల్లిదండ్రులు విద్యార్థులకు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించారు. డ్రైవర్ రోజూ టాటాఏస్ వ్యాన్ తీసుకువచ్చేరని అది రిపేర్‌కు వెళ్లడంతో ఆటో తీసుకొచ్చినట్లు తల్లిదండ్రులు తెలిపారు. ప్రమాదం విషయం తెలుసుకున్న పీడీఎస్‌యూ నాయకులు మమత, వినోద్, సిద్దు గాయపడిన విద్యార్థులను పరామర్శించారు.

కీచక ఉపాధ్యాయుడిపై మరో కేసు

రామారెడ్డి: పోక్సో కేసులో బెయిల్‌పై వచ్చి బాధితులను బెదిరించిన ఉపాధ్యాయుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. రామారెడ్డి ఎస్సై నరేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లాలోని ఓ పాఠశాలలో అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు మహేశ్‌పై ఇటీవల విద్యార్థినులు షీటీంకు సమాచారం ఇచ్చారు. షీ టీం సభ్యులు విచారణ చేసి రెండ్రోజుల క్రితం మహేశ్‌పై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. బెయిల్‌పై బయటికి వచ్చిన మహేశ్ .. బాధితులను తీవ్రంగా బెదిరించగా శనివారం మరో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

అపరిశుభ్ర హోటళ్లకు జరిమానా


తనిఖీలు చేస్తున్న బల్దియా అధికారులు

నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని పలు హోటళ్లపై మున్సిపల్ అధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ జయకుమార్ సిబ్బందితో కలిసి నగరంలోని పలు హోటళ్లను పరిశీలించారు. రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న టీ హోటళ్లు అపరిశుభ్రంగా ఉండడంతో వారికి రూ.5 వేల చొప్పున జరిమానా విధించారు. కంఠేశ్వర్ బైపాస్‌లోని లహరి హోటల్‌లో పాడైపోయిన చికెన్‌ను గుర్తించి, నిర్వాహకులకు రూ. 10 వేల ఫైన్ వేశారు. ముబారక్‌నగర్, కుమార్ గల్లి, ఖలీల్‌వాడీల్లోని పలు హోటళ్లలో తనిఖీలు చేపట్టి రూ.45 వేల జరిమానా విధించినట్లు ఏఎంసీ జయకుమార్ తెలిపారు. వారి వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్లు షేక్ షాదుల్లా, కృష్ణ, జవాన్లు, సిబ్బంది ఉన్నారు.

ఆపన్నహస్తం అందించండి

- రోడ్డు ప్రమాదంలో పడకల్ యువకుడికి తీవ్ర గాయాలు
- చికిత్సకు సుమారు రూ.6లక్షల వరకు అవసరం
- దాతల కోసం బాధిత కుటుంబ సభ్యుల ఎదురుచూపు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆకాశ్

జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన యువకుడు పసుల ఆకాశ్ ఈ నెల 11న బైక్‌పై వస్తుండగా నూర్‌సింగ్ తండా వద్ద మరో వ్యక్తి బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆకాశ్‌కు తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌లోని సరోజిని ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి బ్రెయిన్‌లోని నరాలు చిట్లిపోయాయని, కుడి కన్ను పూర్తిగా దెబ్బతిన్నదని తెలిపారు. ఆపరేషన్ కోసం రూ. 6లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. అంత స్థోమత లేకపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు దాతల చేయూత కోసం ఎదురుచూస్తున్నారు.

పోలీస్ ఉద్యోగం రాకపోవడంతో ఇడ్లీ సెంటర్‌తో ఉపాధి..

ఆకాశ్‌కు భార్య మౌనిక, ఐదేళ్ల లోపు పాప, ఓ బాబు ఉన్నారు. ఆకాశ్ ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగం కోసం కొంత వరకు అప్పులు చేసి హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకున్నాడు. కానీ ఉద్యోగం రాలేదు. దీంతో చేసిన అప్పులు తీర్చాలన్న ఉద్దేశంతో ఇటీవల కలిగోట్‌లో చిన్న ఇడ్లీ సెంటర్ ప్రారంభించాడు. ఇడ్లీ సెంటర్ ద్వారా వచ్చిన డబ్బులతోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కానీ అనుకోని పరిస్థితుల్లో ఆకాశ్ రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలు కావడంతో కుటుంబం దిక్కుతోచనిస్థితికి చేరింది. ప్రస్తుతం ఆకాశ్ పరిస్థితి విషమంగా ఉందని వెంటనే డబ్బులు సమకూర్చుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో ఆకాశ్‌కు మెరుగైన వైద్యం కోసం పడకల్ గ్రామస్తులు, యువకులు తమవంతుగా ఆర్థికంగా సహాయ సహకారాలు అందజేస్తున్నారు. మరికొంత మంది దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించాలని బాధిత కుటుంబీకులు కోరుతున్నారు. ఆర్థికసాయం చేయదల్చిన దాతలు ఆకాశ్ సోదరుడు పసుల రవి సెల్ నంబర్‌కు 91823 98298కు ఫోన్‌పే చేయగలరు.

ఏకచక్రేశ్వరుడి సన్నిధిలో గజ్జె పూజ


గజ్జె పూజలో పాల్గొన్న నాట్యమణులతో నృత్యాలయం వ్యవస్థాపకులు కర్ణం శ్రీనివాస్

బోధన్: బోధన్ ఏకచక్రేశ్వరాలయంలో శుక్రవారం రాత్రి శ్రీ నాట్యతరంగిణి కూచిపూడి నృత్యాలయం విద్యార్థుల తొలి గజ్జె పూజ వేడుకలు ఆద్యంతం వైభవంగా సాగాయి. నృత్యాలయం వ్యవస్థాపకులు, నాట్యాచార్యులు కర్ణం శ్రీనివాస్, సతీమణి కర్ణం తిరుమల నేతృత్వంలో కూచిపూడి నాట్యం నేర్చుకునే శిష్యుల గజ్జె పూజ వేడుకను శాస్త్రీయ బద్ధంగా నిర్వహించారు. 13 మంది బాలికలు ఏకచక్రేశ్వరుడి సన్నిధిలో గజ్జెలు ధరించి తొలి అడుగులు వేశారు. నిజామాబాద్ నగరంలోని ప్రభుత్వ శ్రీ జ్ఞాన సరస్వతీ సంగీత కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ టీ స్వప్నరాణి మధురమైన గాత్రం, విశ్వనాథ్ మాస్టర్ మృదంగ వాద్యం మధ్య గజ్జెలు ధరించిన బాలికలు నృత్య ప్రదర్శనతో విశేషంగా ఆకట్టుకున్నారు.ఆలయ కమిటీ చైర్మన్ హరికాంత్ చారి, ప్రముఖ యోగా మాస్టర్ మాధవీలత, పట్టణ ప్రముఖులు గజ్జె పూజ వేడుకను తిలకించారు.

సాక్షి ఫ్యామిలీ
నిజామాబాద్
ఆదివారం ॥ 20-4-2025

ఈస్టర్ పర్వదినం ప్రత్యేకం

దేవుని విమోచన కార్యక్రమంలో అత్యంత శకిమంతమైనది క్రీస్తు పునరుత్థాన శక్తే. మానవునికి మరణం తోనే జీవితం అంతం కాదని పునరుత్థానం తెలియజేసింది. ప్రతి మనిషి సదాకాలము దేవునితో కలిసి జీవించవచ్చన్న గొప్ప నిరీక్షణ కలిగింది. ఎందుకంటే యేసు అంటున్నాడు 'పునరుత్థానం జీవం నేనే. నా యందు విశ్వాసముంచు వాడు చనిపోయినను బ్రతుకును. బతికి నాయందు విశ్వాసముంచు వాడు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు'.

మరణమా నీ ముల్లెక్కడ?

శుక్రవారం సిలువ వేయబడిన యేసును తలచుకొని యూదా మతపెద్దలు యేసు ఇక శాశ్వతంగా మట్టిలో కలిసి పోయాడని సంబర పడ్డారు. వారిలో ఆ దుష్ట తలంపు పెట్టిన అపవాదియైన సాతాను దేవునిపై విజయం సాధించానని ఇక ఈ లోకం అంతా తన చెప్పు చేతల్లో ఉండిపోతుందని భ్రమ పడ్డాడు. అయినా ఎందుకైనా మంచిదని క్రీస్తును ప్రత్యేకంగా అరిమత్తయి ఏర్పాటు చేసిన సమాధి చుట్టూ ఎవరు తొలగించలేని పెద్ద రాతిని ఏర్పాటు చేశారు. బలమైన రోమా సైనికులను సమాధికి కాపలాగా పెట్టారు. క్రీస్తు మూడవ దినమున లేస్తానని చెప్పిన మాట నెరవేరకుండా శతవిధాలుగా తమ ప్రయత్నం వారు చేశారు. ఇక ఏసు చరిత్ర శాశ్వతంగా ఖననం చేశామని ఇక ఎప్పటికీ తామే మతపెద్దలుగా యూదా ప్రజలను తమ అధీనంలోనే వుంచుకోవచ్చని రోమా అధికారులకు లంచం కడుతూ తమ పబ్బం గడుపుకోవచ్చని కలలుగంటూ శనివారం అంతా హాయిగా నిద్రపోయారు. మరోపక్క యేసు చేసిన అద్భుత సూచక క్రియలు చూసి ఆయన పరలోక దివ్య వాక్కులు విన్న ప్రజలు యేసు సిలువ మరణాన్ని జీర్ణించు కోలేని స్థితిలో వుండిపోయారు. యూదా గలిలయా సమరియ ప్రాంతాల్లో క్రీస్తు ద్వారా స్వస్థత పొందిన గుడ్డి, కుంటి, మూగ, చెవిటి వారు, కుష్టు రోగులు మరణించి క్రీస్తుతో బతికింపబడినవారు, క్రీస్తును అభిమానించేవారు, వివిధ అద్భుతాలను చూసినవారు యేసు మరణంతో శోకసంద్రంలో మునిగిపోయారు. చివరకు యేసుతో మూడున్నర సంవత్సరాలు తిరిగిన ఆయన శిష్యులు యూదా మతపెద్దలకు భయపడి యెరూషలేము పట్టణంలో ఓ గదిలో దాక్కుండిపోయారు. అయినా దేవుని ప్రవచనాలు నెరవేరక తప్పవు కదా! భూమి పునాదులు వేయక ముందే ఆయన ఏర్పాటు చేసిన రక్షణ ప్రణాళిక అనాది సంకల్పం నెరవేరక తప్పదు కదా!

యేసు పునరుత్థాన శక్తి

యేసు తన శరీరంలో సిలువ ద్వారా పాపానికి శిక్ష విధించి బలి అర్పణగా శరీరాన్ని సమర్పించడం ద్వారా మరణంపై సాతాను కున్న అధికారాన్ని నాశనం చేశాడు. మనుమల్లో మరణం పట్ల ఉన్న భయాన్ని పునరుత్థాన శక్తితో తీసివేయడం ద్వారా దేవునితో ధైర్యంగా విశ్వాసంతో ముందుకు కొనసాగడానికి బాటలు వేశాడు. ప్రథమ మానవుడైన ఆదామును సాతాను లోబరుచుకొని మరణానికి పాత్రుడుగా చేశాడు. ఫలితంగా పుట్టిన ప్రతి మనిషి గిట్టక తప్పని పరిస్థితి నెలకొంది. అయితే కడపటి ఆదాముగా వచ్చిన యేసు పునరుత్థానం ద్వారా ఆ శాపం పూర్తిగా తొలగించబడింది. అంటే మనుష్యుని ద్వారా ఎలా మరణం వచ్చిందో మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానం కలిగింది. ఈ ప్రక్రియ ద్వారా క్రీస్తులా ప్రతి ఒక్కరూ పునరుత్థానం పొందే అవకాశం లభించింది.

తొలగింపబడిన రాయి

ఆదివారం ఉదయమే ఇంకా తెల్లవారకముందు యేసు ద్వారా స్వస్థత పొందిన మగ్దలేని మరియ, కొంతమంది ధైర్యవంతులైన స్త్రీలు సుగంధ ద్రవ్యాలను తీసుకొని యేసును సమాధి చేసిన చోటుకు చేరుకున్నారు. రోమా అధికారక ముద్రతో వేయబడ్డ ఆ పెద్ద రాయి ఎవరు తొలగిస్తారన్న ఆలోచన ఆ మహిళకు కలిగింది. తీరా సమాధి వద్దకు వచ్చి చూస్తే వారి జీవితంలో ఎన్నడు కలుగనంత విభ్రాంతికి లోనయ్యారు. అప్పటికే సమాధి మీద రాయి తొలగించబడింది. అంతకు క్రితమే యేసు సమాధిమీద ఉన్నరాయి పరలోకం నుండి ప్రభువుదూత దొర్లించినట్లు లేఖనాలలో రాయబడింది. ఆ ప్రాంతంలో భూకంపం వచ్చింది. అక్కడ కావలి వున్న రోమా సైనికులు భయపడి చచ్చినవారిలా పరుండిపోయారు. స్త్రీలు అక్కడికి వచ్చినప్పుడు రాయి దొర్లించబడి ఉండటం చూశారు. సమాధి లోపల యేసు దేహం వారికి కనిపించలేదు. అప్పుడు దూత ప్రత్యక్షమై "సజీవుడైన క్రీస్తును మృతులలో ఎందుకు వెదుకుచున్నారు? ఆయన ముందుగా చెప్పిన విధంగా లేచియున్నాడు. ఈ శుభవర్తమానం శిష్యులకు తెలియజేయండి" అని చెప్పడంతో స్త్రీలు మహానందంతో వెనుకకు తిరిగారు.

పునరుత్థానుడైన క్రీస్తు

యేసు చెప్పిన విధంగానే చనిపోయిన మూడవరోజు మృత్యుంజయుడై లేచాడు. దానితో ప్రపంచ చరిత్రలో మరణాన్ని గెలిచి లేచిన చారిత్రాత్మిక పురుషుడిగా నిలిచి పోయాడు. ప్రపంచ చరిత్ర క్రీస్తుపూర్వం క్రీస్తు శకంగా చీలిపోయింది. పునరుత్థానుడైన యేసు ముందుగా తనను వెదకడానికి వచ్చిన స్త్రీలకు కన్పించి వారికి శుభమని చెప్పి ముందు మీరు వెళ్ళి నా శిష్యులకు గలిలయ వెళ్ళమని చెప్పి అక్కడ వారిని కలుస్తానని చెప్పాడు.

ఈలోగా సమాధికి కాపలాగా ఉన్న రోమా సైనికులు ప్రధాన యాజకుల వద్దకు పోయి యేసు మరణం నుండి లేచిన సంగతి వివరించారు. వారు రోమా సైనికులకు లంచం ఇచ్చి ఈ విషయం ఎవ్వరికీ చెప్పవద్దని చెబుతూ మేము రాత్రివేళ నిద్దుర పోతుంటే యేసు శిష్యులు వచ్చి యేసు శరీరాన్ని ఎత్తుకు వెళ్ళారని అబద్ధం చెప్పండి ఒకవేళ అధికారులు ఏమన్నా హడావుడి చేస్తే వారిని మేము చూసుకుంటామని నచ్చచెప్పి పంపించివేశారు. అయితే యేసు చెప్పిన విధంగానే గలిలయ శిష్యులకు దర్శనం ఇచ్చాడు.

ఈ ఈస్టర్ పండుగ సమయంలో యేసు పునరుత్థాన శక్తి ప్రతి ఒక్కరం పొందుదం గాక! ఆమేన్!!

– మన్య జ్యోత్స్న రావు



నవోదయాన్నిచ్చిన ఆదివారం

మానవ చరిత్రలో ఆ ఆదివారం ఎన్నటికీ మరపురానిది. ఎందుకంటే యేసుక్రీస్తు అన్ని కుట్రలనూ, దుర్మార్గాలనూ, దౌర్జన్యాలనూ పటాపంచలు చేసి సమాధినీ, మరణాన్నీ గెలిచి సజీవుడు కావడం ద్వారా దీనులు, పాపులు, నిరాశ్రయులందరికీ నవోదయాన్నిచ్చిన దినం ఆ ఆదివారం...

యేసుక్రీస్తు మానవరూప ధారియైన రక్షకుడుగా ఈ లోకానికి తన పరమ తండ్రి ఆదేశాలు, సంకల్పాలను అమలుపర్చడానికి విచ్చేసిన దైవకుమారుడు, అంటే అన్నివిధాలా దేవుడే!!!. అలాగైతే జననానికి, మరణానికి, పునరుత్థానానికి దేవుడు అతీతుడు కదా... మరి ఇదంతా ఎందుకు జరిగింది? అన్న ప్రశ్న తప్పక రావాలి.

నాలుగేళ్ల ఒక బాలుడు నీళ్లు పెద్దగా లేని ఒక బావిలో పడ్డాడు. అయ్యో అంటూ జనం బావి చుట్టూ గుమికూడారు. వాడసలే భయకంపితుడై ఉన్నాడు. పైగా పసితనం, అంతా గందరగోళం.. గట్టిగా ఏడుస్తున్నాడు. ఇంతలో ఒకాయన బావి వద్దకొచ్చి లోనికి తొంగి చూశాడు. వెంటనే అక్కడున్న ఒక తాడు తన నడుముకు కట్టుకొని అక్కడున్న వారితో తనను లోనికి దించమన్నాడు. అతన్ని చూసి పిల్లాడు మహదానందంతో 'డాడీ' అని గట్టిగా అరిచి తండ్రిని కరిచి పట్టుకున్నాడు. తండ్రి వాడిని చంకకేసుకొని గట్టిగా కరుచుకొని తమను పైకి లాగమన్నాడు. పిల్లాడు బావిలో పడిపోతే అందరికీ సానుభూతే!! కాని పర్యవసానాలాలోచించకుండా చనిపోయేందుకు కూడా తెగించి కొడుకును కాపాడుకునే శక్తి ఒక్క తల్లి, తండ్రి ప్రేమకు మాత్రమే ఉంటుంది. శుక్రవారం నాడు సిలువలో అదే జరిగింది. పాపిని కాపాడేందుకు పరమ తండ్రి కుమారుడిగా, రక్షకుడుగా చనిపోయేందుకు కూడా సిద్ధపడి యేసుప్రభువు బావిలోకి దూకాడు. నేను చనిపోయినా ఫరవాలేదు, నా కుమారుడు బతికితే చాలు అనుకునేదే నిజమైన తండ్రి ప్రేమ. పరమ తండ్రిలో ఆయన అద్వితీయ కుమారుడు, కుమారునిలో పరమ తండ్రి సంపూర్ణంగా విలీనమైన అపారమైన ప్రేమ ఆ దైవత్వానిది. బావిలోనుండి కొడుకుతో సహా బయటికొచ్చిన సమయమే యేసు మరణాన్నీ గెలిచి సజీవుడైన ఈస్టర్ ఆదివారపు నవోదయం.

నేనే పునరుత్థానాన్ని... నేనే జీవాన్ని

ఆయన ఆరోహణుడు కావడం కళ్లారా చూసిన అనుభవంతో ఆయన అనుచరుల జీవితాలు సమూలంగా పరివర్తన చెందాయి. ఆయన సజీవుడైన దేవుడు అన్న నిత్యసత్యం వారి జీవితాల్లో లోతుగా ప్రతిష్ఠితమై వారంతా ఒక బలమైన చర్చిగా శక్తిగా ఏర్పడి, ఆ తర్వాత సువార్త సత్యం కోసం ప్రాణాలు కూడా త్యాగం చేసేందుకు సంసిద్ధమయ్యే ధైర్యాన్ని వారికిచ్చింది. మరణానికి మనిషిపై పట్టు లేకుండా చేసిన నాటి ఉదంతమే ఈస్టర్ అనుభవం.

యేసుప్రభువు నేనే పునరుత్థానాన్ని, జీవాన్ని అని కూడా ప్రకటించి, తానన్నట్టే చనిపోయి తిరిగి లేవడం ద్వారా తానే జీవాన్నని రుజువు చేసుకున్నాడు. తనలాగే విశ్వాసులు కూడా పురుత్థానం చెంది పరలోకంలో తమ దేవుని సహవాసంలో నిత్య జీవితాన్ని పొందుతారని ప్రభువు బోధించాడు.

– డా. సుభక్త

హెల్త్

సమ్మర్... చైల్డ్ కేర్!



ఎండలు మండిపోతున్నాయి. పిల్లలకు సెలవులూ వచ్చాయి. నీడపట్టున ఉండాల్సిన పిల్లలు కాస్తా సెలవుల్లో ఆడుకోవడం కోసం ఎండల్లోకి వెళ్తే...? అది మరింత ప్రమాదం. ఈ వేసవి వేడిమితో చిన్నారులకు వచ్చే సమస్యలేమిటో, ఈ సెలవుల ఎండల్లోంచి పిల్లలను కాపాడుకోవడం ఎలాగో తెలిపే కథనమిది.

పిల్లలకు ఆటల్లో ఒళ్లు తెలియకపోవడమే కాదు... ఎండ తీవ్రతా తెలియదు. ఇప్పటికే ఎర్రటిఎండ మండుతోంది. ఇంతటి ఎండల తీవ్రత వల్ల ఆరుబయట ఆడే పిల్లలకు వడదెబ్బ మొదలుకొని, డీహైడ్రేషన్ వరకు ఎన్నో సమస్యలు వచ్చే అవకాశం ఉంది. నీడపట్టున ఉంటే వడదెబ్బ తగలదని కొందరి అభిప్రాయం. కానీ నీడ ఉన్నప్పటికీ అక్కడ వేడిమి తీవ్రత ఎక్కువగా ఉంటే వడదెబ్బ తగిలే ప్రమాదం లేకపోలేదు. వేసవిలో చిన్నారులకు ఎండ ముప్పులు ఏయే రూపాల్లో వస్తాయో చూద్దాం.

ఎండ తీవ్రతతో సమస్యలివి...



మజిల్ క్రాంప్స్: దేహం తన జీవక్రియలను కొనసాగించడానికి మెదడు నుంచి ప్రతి నరానికీ ఆదేశాలు అందుతూ ఉంటాయి. ఈ ఆదేశాలన్నీ లవణాలలోని విద్యుదావేశం కలిగిన అయాన్లు నరాల ద్వారా ప్రసరించడం వల్ల కండరాలకు ఆదేశాలందుతూ ఉంటాయి.

ఎండవేడిమి తీవ్రతతో చెమట రూపంలో నీటినీ, లవణాలనూ కోల్పోవడం వల్ల నరాల ద్వారా మెదడునుంచి కండరాలకు సరైన ఆదేశాలందవు. దాంతో డీ-హైడ్రేషన్‌కు గురి కాగానే కండరాలు బిగుసుకుపోతాయి. వీటినే మజిల్‌క్రాంప్స్‌గా చెబుతారు. మజిల్‌క్రాంప్స్ వస్తే వెంటనే దేహానికి నీటిని అందించాలి.

పిల్లల్లో మజిల్ క్రాంప్స్ వస్తే: పిల్లలకు మజిల్‌క్రాంప్స్ కారణంగా కండరాలు బిగదీసుకుపోతుంటే వారికి 'ఓరల్-రీ-హైడ్రేషన్ (ఓఆర్ఎస్) ద్రావణాన్ని తాగించాలి. ● ఓఆర్ఎస్ అందుబాటులో లేకపోతే కొబ్బరినీళ్లు కూడా తాగించవచ్చు. ● ఓఆర్ఎస్‌గానీ, కొబ్బరినీళ్లుగానీ అందుబాటులో లేకపోతే... ఒక అరటిపండు తినిపించి, మంచినీళ్లు తాగించాలి. అరటి పండులో పొటాషియం వంటి లవణాలు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి అరటిపండూ, నీళ్లతో అవి చాలా వరకు భర్తీ అవుతాయి.

వడదెబ్బ: ఒక్కోసారి చాలా ప్రాణాంతకంగా మారే మెడికల్ ఎమర్జెన్సీ కండిషన్ ఈ వడదెబ్బ. శరీర జీవక్రియలన్నీ సక్రమంగా జరగడానికి అవసరమైన ఉష్ణోగ్రత 98.4 డిగ్రీల ఫారెన్‌హీట్. కానీ పిల్లలు వడదెబ్బకు లోనైతే వారి శరీర ఉష్ణోగ్రత అకస్మాత్తుగా పెరిగిపోతుంది. వాస్తవానికి శరీర ఉష్ణోగ్రత 98.4 డిగ్రీలు మెయింటెయిన్ అయ్యేందుకు మెదడులోని హైపోథెలామస్ అనే గ్రంథి తోడ్పడుతుంది. దేహ ఉష్ణోగ్రత పెరిగినప్పుడు చెమటలు పట్టి... దేహంలోంచి ఉష్ణోగ్రతను తీసుకుని ఆ చెమటలు ఆవిరైపోతూ ఉండటం వల్ల శరీర ఉష్ణోగ్రత ఒకే స్థాయిలో మెయింటైన్ అవుతుంటుంది. కానీ దేహ ఉష్ణోగ్రత అదే పనిగా పెరిగిపోతూండటంతో స్వేదగ్రంథులు అలసిపోయి ఇక ఏమాత్రం పనిచేయని స్థితికి చేరుకుంటాయి. దాంతో శరీరం వేడెక్కుతున్నా... దాన్ని నియంత్రిస్తూ ఉష్ణోగ్రత సమంగా ఉండేలా చేయడానికి అవసరమైన యంత్రాంగం విఫలం కావడంతో దేహ ఉష్ణోగ్రత ఇంకా ఇంకా పెరిగిపోతుంది. దీనికి ఓ సూచన కూడా ఉంటుంది. పిల్లల చంకల్లోనూ చెమట పట్టని స్థితి రావడం ఒక్కోసారి పిల్లలు స్పృహ తప్పిపోయి అపస్మారక స్థితికి చేరడం వడదెబ్బను సూచిస్తాయి.



వడదెబ్బలో లక్షణాలివి...

● వికారం; ● వాంతులు; ● కళ్లు తిరగడం; ● నీరసం; ● స్పృహ తప్పడం; ● ఫిట్స్ రావడం; ● చివరగా కోమాలోకి వెళ్లడం జరగవచ్చు.

వడదెబ్బకు చికిత్స: దేహ ఉష్ణోగ్రత 104 డిగ్రీల ఫారెన్‌హీట్‌కు చేరి అంతకంతకూ పెరుగుతుంటే... ఆ కారణంగా మెదడు, గుండె, మూత్రపిండాలు, కాలేయం వంటి కీలకమైన అవయవాల పనితీరు తీవ్రంగా దెబ్బతింటుంది. అప్పుడు శరీర ఉష్ణోగ్రతను మళ్లీ సాధారణ స్థాయికి (నార్మల్‌కు) తీసుకురావడం అవసరం.

ఒంటి ఉష్ణోగ్రత 100 ఫారెన్‌హీట్‌కు మించుతున్నట్లు తెలియగానే వెంటనే పిల్లలను చల్లటి గాలి సోకేలా ఫ్యాన్ కింద ఉంచాలి. ఫ్యాన్ కింద కూడా వేడిగాలి వస్తుంటే పిల్లల దుస్తులను వదులు చేసి, ఒంటికి చల్లగాలిని బాగా తగలనివ్వాలి. దుస్తులు ఇబ్బందికరంగా ఉంటే నడుముకు చిన్న ఆచ్ఛాదన ఉంచి, బట్టలన్నీ తీసేయాలి. చల్లటి నీటిలో ముంచిన గుడ్డతో ఒళ్లంతా తుడుస్తూ చల్లటి గాలి ఒంటికి వేగంగా తగులుతూ వెళ్లేలా చూడాలి. ఇలా ఒళ్లు త్వరగా చల్లబడుతుంది.

● ఈ చర్యల తర్వాత కూడా శరీర ఉష్ణోగ్రత తగ్గకపోతే పిల్లల చంకల కింద / గజ్జల దగ్గర ఐస్ గడ్డలనుంచాలి. దాంతో శరీరం మరింత చల్లబడుతుంది. అప్పటికీ శరీర ఉష్ణోగ్రత తగ్గకపోతే, దాన్ని మెడికల్ ఎమర్జెన్సీగా గుర్తించి వెంటనే ఆసుపత్రికి తరలించాలి.

ఎండల్లో పిల్లలు ఎక్కువగా చెమట వల్ల నీరూ, లవణాలూ కోల్పోతున్నారని తెలియడానికి విపరీతంగా చెమట పట్టడమే సూచన అని కొందరు అపోహపడుతుంటారు. అది వాస్తవం కాదు. పిల్లలతో పోలిస్తే పెద్దల్లో చెమట గ్రంథులు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి ఉష్ణోగ్రత పెరగగానే చెమటలు పట్టడం పెద్దల్లోనే ఎక్కువగా కనిపిస్తుంటుంది. కానీ పిల్లల్లో అలా కాదు. వాళ్లలో పెద్దల మాదిరిగా చెమటలు పట్టాలంటే చాలా ఎక్కువ ఉష్ణోగ్రత అవసరం. ఒంటిని చల్లబరిచే మెకానిజమైన చెమట పట్టడమన్నది పిల్లల్లో కాస్త తక్కువే కావడం వల్ల పెరిగే కొద్దిపాటి వేడిమి కూడా పిల్లలపై ఎక్కువగా దుష్ప్రభావం చూపుతుంది. అందుకే పిల్లలకు పెద్దగా చెమటలు పట్టకపోయినా... వాళ్ల ఒంటి ఉష్ణోగ్రత త్వరగా పెరుగుతుందని తెలుసుకోవడంతోపాటు చిన్నపిల్లల్లో చెమట గ్రంథుల సంఖ్య తక్కువ కాబట్టి వేడెక్కిన ఒళ్లు వెంటనే చల్లబడదు కాబట్టి బాగా చల్లగా ఉండేచోటే వాళ్లు ఆడుకుంటూ ఉండేలా చూడాలి. ఆరుబయటి ఉష్ణోగ్రత బాగా తగ్గాకే వారిని బయట ఆటలాడటానికి అనుమతించాలి.



పెద్దల కంటే పిల్లల్లో చెమట గ్రంథులు తక్కువ కాబట్టి...

ఒబేస్ పిల్లలకు జాగ్రత్త అవసరం!

మామూలు పిల్లలతో పోలిస్తే కాస్త ఒబేస్‌గా ఉండే పిల్లల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. ఆ పిల్లల ఒంట్లోంచి నీళ్లు కోల్పోతున్నప్పుడు ఆ నీటితో పాటు విలువైన ఖనిజలవణాలనూ కోల్పోతున్నారని గ్రహించాలి. స్థూలకాయమున్న పిల్లలు బాగా ఆటలాడుతున్నప్పుడు ప్రతి కిలోకు 50 మిల్లీలీటర్ల నీరు కోల్పోవచ్చు. దాంతో తమ పిల్లలు బరువు కోల్పోతూ, ఆరోగ్యంగా మారుతున్నారంటూ పెద్దలు అపోహ పడటం సరి కాదు. వాళ్లు విలువైన ఖనిజలవణాలు కోల్పోయి డీ-హైడ్రేషన్‌కు గురవుతున్నారనే విషయాన్ని గ్రహించాలి. అందుకే ఇలా బరువు తగ్గుతున్నప్పుడు పెద్దలు వారి ఒంటిలో జరిగే జీవక్రియలకు (మెటబాలిక్ యాక్టివిటీస్‌కు) అవసరమైన నీటిని వెంటవెంటనే భర్తీ చేస్తూ ఉండాలి. అందుకే స్థూలకాయులైన పిల్లలు వెంటవెంటనే మరింత బరుతు తగ్గుతున్నట్లు గ్రహిస్తే పెద్దలు వారి ఒంట్లోకి తగిన ఎలక్ట్రొలైట్స్ పంపించేందుకు కొబ్బరినీళ్లు, గ్లూకోజ్ వంటివి ప్రతి 20 నిమిషాలకొకసారి తాగిస్తూ ఉండటం తప్పనిసరి.

ఎండ దుష్ప్రభావాల నివారణ ఇలా...

● ఎండవేళల్లో పిల్లలు బయటకు వెళ్లకుండా ఇంట్లోని చల్లటి ప్రదేశాల్లోనే ఆడుకునేలా ప్రోత్సహించాలి. ● ఎండవేళల్లో ఇన్‌డోర్ గేమ్స్‌కు మాత్రమే వారిని పరిమితం చేస్తే బాగుంటుంది. ● ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వారిని ఇంట్లోనే, అందునా ఇంట్లో కూడా చల్లగా ఉండే ప్రదేశాల్లోనే ఉండేలా చూడాలి. ● ఆటల్లో పూర్తిగా నిమగ్నమైపోయిన పిల్లలు తరచూ మంచినీళ్లు తాగకపోవచ్చు. అందుకే తరచూ వారు కొద్దికొద్దిగా మంచినీళ్లు తాగుతుండేలా చూడాలి. వీలైతే మధ్య మధ్యలో కొబ్బరినీళ్లు, పళ్లరసాలు కూడా ఇవ్వవచ్చు.

ఇలాంటి కొద్దిపాటి జాగ్రత్తలతో పిల్లలు వేసవి దుష్ప్రభావాలకు లోనుకాకుండా జాగ్రత్త పడాలి. సాయంత్రాలు బాగా చల్లబడ్డ తర్వాతనే వాళ్లను ఔట్‌డోర్ గేమ్స్‌కు అనుమతించాలి.



డా॥ శివనారాయణ రెడ్డి వెన్నపూస,
సీనియర్ నియోనేటాలజిస్ట్ అండ్ పీడియాట్రీషియన్

ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకుంటున్నారా?

గతంలో గర్భధారణ (ప్రెగ్నెన్సీ) ప్లానింగ్ అంటూ ఏదీ ఉండేది కాదు. నిజానికి తమకు కావాల్సినప్పుడు, తమకు అవసరమైన సమయంలోనే ప్రెగ్నెన్సీ వచ్చేలా ప్లాన్ చేసుకుంటే... అది వచ్చేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో కాబోయే తల్లికీ, పుట్టబోయే బిడ్డకూ చాలా ప్రయోజనాలు ఉంటాయి. తల్లీ బిడ్డా సురక్షితంగా కూడా ఉంటారు. సరైన ప్రెగ్నెన్సీ ప్లానింగ్‌తో ప్రయోజనాలెలా కలుగుతాయో తెలుసుకుందాం.

గతం తరం యువతుల్లో తమకు ప్రెగ్నెన్సీ వచ్చిన విషయం నెల తప్పిన తర్వాత గానీ తెలిసేది కాదు. అప్పుడు... తమకు పెగ్నెన్సీ వచ్చిందా లేదా అని తెలుసుకోవడం కోసం ఇంట్లోనే కొన్ని పరీక్షలు చేసుకునేవారు. అయితే గర్భధారణను ముందే ప్లాన్ చేసుకోవడం వల్ల పుట్టబోయే పిల్లల్లో కొన్ని లోపాల నివారణకు ముందునుంచే జాగ్రత్తపడే అవకాశం ఉంటుంది. ఉదాహరణకు ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకున్న మహిళ తాము నెల తప్పాలనుకున్న మూడు నెలల ముందు నుంచే ఫోలిక్ యాసిడ్ అనే పోషకాన్ని తీసుకోవడం వల్ల ప్రయోజనాలుంటాయి. మార్కెట్‌లో మాత్రల రూపంలో దొరికే ఈ ఫోలిక్ యాసిడ్ చాలా చవక. నిజానికి పాలకూర లాంటి ఆకుకూరల్లో అది సమృద్ధిగా ఉంటుంది. పిండంలో వచ్చేందుకు అవకాశమున్న న్యూరల్ ట్యూబ్ (వెన్నుపాము) లోపాలను అది అరికడుతుంది. పుట్టుకతో వచ్చే ఈ వెన్నుపాము



లోపాలను స్పైనాబైఫిడా అంటారు. ఫోలిక్ యాసిడ్ ఇలాంటి అనేక ప్రెగ్నెన్సీ లోపాలను అరికడుతుంది కాబట్టి ప్రెగ్నెన్సీని ప్లాన్ చేసుకున్న మహిళలకు మూడు నెలల ముందునుంచే అబ్‌స్టెట్రీషియన్స్/ గైనకాలజిస్టులు ఫోలిక్ యాసిడ్ మాత్రలను సూచిస్తుంటారు. ప్రెగ్నెన్సీ ప్లానింగ్ వల్ల స్పైనా బైఫిడా మాత్రమే కాకుండా పౌష్టికాహార లోపాల వల్ల పిండదశలో ఎదురయ్యే మరెన్నో సమస్యలూ నివారించవచ్చు. అంతేకాదు... దేశంలోని మహిళల్లో దాదాపు 59 శాతం మందిలో రక్తహీనత (అనీమియా) ఎక్కువ. ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకునే మహిళకు ఐరన్ సప్లిమెంట్లు ఇవ్వడం ద్వారా కూడా కాబోయే తల్లీ, పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకునేందుకు అవకాశం ఉంది.

గర్భం ప్లాన్ చేసుకున్న నాటి నుంచి మహిళకు అన్ని పోషకాలూ అందేలా ఆరోగ్యకరమైన సమతులాహారాన్ని ఇవ్వడం, అందులో కూరగాయలు, ఆకుకూరలు, తాజాపండ్లు ఎక్కువగా ఉండేలా చూసుకోవడం వంటి జాగ్రత్తలతో ఇటు కాబోయే తల్లి, పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండటంతో పాటు, ఆ చిన్నారికి తగినంత రోగనిరోధక శక్తి సమకూరేలా జాగ్రత్తలు తీసుకోవడానికి అవకాశముంటుంది.



డా॥ స్వప్న సముద్రాల
సీనియర్ గైనకాలజిస్ట్ అండ్ అబ్‌స్టెట్రీషియన్